క్లుప్తంగా

మకర తోరణం బహూకరణ



దాతలు బహూకరించిన మకర తోరణం

మాకవరపాలెం: దుర్గామల్లేశ్వర అమ్మవారి ఆలయానికి మకర తోరణం బహూకరించారు. స్థానిక బీసీ కాలనీలో దుర్గామల్లేశ్వర దేవస్థానానికి కేతవరపు రంగబాబు మనుమలు శనివారం రూ.40 వేల విలువ చేసే మకర తోరణాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు మల్లికార్జునశర్మ పాల్గొన్నారు.

సిమెంట్ బెంచీల వితరణ



పంచాయతీ కార్యాలయానికి అందజేసిన సిమెంట్ బెంచీలు

మాడుగుల: ఆర్యవైశ్య జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనాథు శ్రీనువాసరావు శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయానికి రెండు సిమెంట్ బెంచీలు వితరణగా అందజేశారు. ఇక్కడికి వచ్చే వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బంది పడకుండా వీలుగా వీటిని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎడ్ల కళావతి, తదితరులు పాల్గొన్నారు.

పశువ్యాధులపై అప్రమత్తం



పశువులకు చికిత్సలు చేస్తున్న వైద్యులు

మాకవరపాలెం: పశువులకు సోకే వ్యాధులపై పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని పశు వైద్యాధికారులు ప్రతాప్‌కుమార్, హరిప్రియ సూచించారు. పెద్దిపాలెంలో శుక్రవారం పశువులకు గర్భకోశ వ్యాధుల నివారణ వైద్య శిబిరం నిర్వహించి, అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 37 పశువులకు చికిత్సలు చేసి మందులు అందజేశారు. నట్టల నివారణ మందులు వేశారు. సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

మండల వార్షిక బడ్జెట్ రూ.3.85 కోట్లు



అంచనా బడ్జెట్‌పై చర్చిస్తున్న ఎంపీపీ లక్ష్మణమూర్తి

నాతవరం: 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 3 కోట్ల 85 లక్షల 90 వేల రూపాయల మండల వార్షిక అంచనా బడ్జెట్ తయారు చేశారు. దీనిపై స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి అధ్యక్షతన శుక్రవారం సమావేశం జరిగింది. మండల పరిషత్ కార్యాలయానికి ఏడాదికి వచ్చే ఆదాయం, ఖర్చులు తదితర వివరాలను కార్యాలయ సూపరింటెండెంట్ పోలుపర్తి పార్థసారథి సభ్యులకు వివరించారు. అంచనా బడ్జెట్‌ను ఎంపీపీ ఆదేశాల మేరకు ఆమోదం కోసం కలెక్టరు, జిల్లా పరిషత్ కార్యాలయాలకు పంపించారు. జెడ్పీటీసీ సభ్యురాలు కాపారపు అప్పలనర్స, ఎంపీడీవో కె.ఉషశ్రీ, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

మోదమాంబ పాదాలకు విరాళం



సర్పంచ్ సంజీవిరావుకు విరాళం అందజేస్తున్న కొండలరావు

మాడుగుల రూరల్: ఎం. కోడూరు మోదమాంబ పాదాలు నిర్మాణానికి దాత యేస్నేటి కొండలరావు కుటుంబ సభ్యులు శుక్రవారం సాయంత్రం రూ.10 వేల విరాళం అందజేశారు. యేస్నేటి రమణమ్మ జ్ఞాపకార్థంగా ఆమె భర్త కొండలరావు, కుమార్తెలు పుణ్యవతి, సునీత సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావుకు ఈ మొత్తం అందజేశారు.



మాడుగుల ట్రాన్స్‌కో ఏఈ రాంబాబుకు వినతి పత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాల నాయుడు తదితరులు



బుచ్చెయ్యపేట మండలం వడ్డాదిలో కరెంట్ చార్జీలు బాదుడుపై నిరసన ప్రదర్శిస్తున్న పార్టీ నాయకులు, మాజీ విప్ ధర్మశ్రీ



ఏఈకి వినతిపత్రం అందజేస్తున్న పార్టీ సీనియర్ నాయకులు సన్యాసిపాత్రుడు, రుత్తల యర్రాపాత్రుడు, పార్టీ నాయకులు

కదం తొక్కిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

- మాడుగుల, వడ్డాది, నర్సీపట్నంలో పాదయాత్రలు, నిరసన ర్యాలీలు
- విద్యుత్ చార్జీలు తగ్గించాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు
- చంద్రబాబు తీరుపై వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు బూడి, మాజీ విప్ కరణం ధర్మశ్రీ, మాజీ ఎమ్మెల్యే గణేష్ ధ్వజం



మాడుగుల ట్రాన్స్‌కో కార్యాలయం ఎదుట మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాల నాయుడు తదితరులు



బుచ్చెయ్యపేట : వడ్డాదిలో విద్యుత్ చార్జీలు తగ్గించాలని ఏఈ రాజుకు డిమాండ్ పత్రం అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే ధర్మశ్రీ, నాయకులు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

మాడుగుల: కూటమి పాలకులు పెంచిన విద్యుత్ చార్జీలు వెంటనే తగ్గించి వినియోగదారులకు న్యాయం చేయాలని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు డిమాండ్ చేశారు. పార్టీ అధినేత, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు విద్యుత్ చార్జీల బాదుడుకు వ్యతిరేకంగా శుక్రవారం మాడుగులలో పోరుబాట కార్యక్రమం నిర్వహించారు. నాలుగు మండలాల నుంచి తరలివచ్చిన పార్టీ శ్రేణులతో కలిసి మాడుగుల మెయిన్ రోడ్డు నుంచి పాదయాత్రగా టాన్స్‌కో ఏఈ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ జై జగన్, జై బూడి అంటూ విద్యుత్ చార్జీలు తగ్గించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ట్రాన్స్‌కో ఏఈ రాంబాబుకు వినతి పత్రం అందజేశారు. అనంతరం బూడి మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో ఇళ్లకు ఉచితంగా అందజేసిన విద్యుత్ మీటర్లకు మరలా డబ్బులు డిమాండ్ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు 50 ఏళ్లకే పింఛను అందజేస్తామని, నేటి వరకు ఆ ఊసే లేదన్నారు. రైతులకు, విద్యార్థులకు ఇంతవరకు ఎటువంటి సహాయం అందలేదన్నారు. కూటమి నాయకులు ప్రజలకు మంచి చేస్తారని నమ్మి ఓటేస్తే, వారిని నట్టేట ముంచేస్తున్నారని దుయ్యబట్టారు. ప్రజలు ఏ నమ్మకంతో ఓటు వేసారో.. దాన్ని వమ్ము చేయకుండా ఐదేళ్ల పాలనలో మంచి చేయాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో మాడుగుల, చీడికాడ ఎంపీపీలు తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, కురసా జయమ్మ నారాయణమూర్తి, జెడ్పీటీసీలు కర్రి సత్యం, కిముడు రమణమ్మ, మాజీ ఎంపీపీ వేమవరపు రామధర్మజ, ఏఎంసీ మాజీ చైర్మన్ శానాపతి కొండలరావు, సీడీసీ చైర్మన్ సుంకరి శ్రీనివాసరావు, ఆర్య వైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దేవరాపల్లి శ్రీనువాసరావు, గొల్లవిల్లి సంజీవరావు, దేవరాపల్లి, చీడికాడ మండలాధ్యక్షులు బూరె బాబూరావు, గొల్లవిల్లి రాజబాబు, మాడుగుల పట్టణాధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనువాసరావు, యూత్ నాయుడు గొల్లవిల్లి స్వామినాయుడు, కె. కోటపాడు మండల యూత్ ప్రెసిడెంట్ గౌర్రుపోటు వెంకటరమణ, ఎంపీటీసీలు పొలిమేర విజయలక్ష్మి, కుక్కర మహేశ్వరి, కోఆప్షన్ మెంబరు షేక్ ఉన్నీసాబేగం, తలారి అప్పారావు, శ్రీనాథు సూర్యకాంతం, ఆర్లి మాధవి నాయుడు, ఎటుకూరి రాజేష్, రొంగలి సూర్యనారాయణ, చీపురుపల్లి అచ్చిబాబు, లెక్కల గోపి, సర్పంచ్ వేచలపు దొరబాబు, దేవరాపల్లి మండల నాయకులు చింతల సత్యవెంకటరమణ, వరదపు రెడ్డి లలితా నాయుడు, కె.వి.రమణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు పెంపుపై ప్రజాగ్రహం

బుచ్చెయ్యపేట: అధికారంలోకి వస్తే కరెంట్ చార్జీలు తగ్గిస్తామని చెప్పి గద్దెనెక్కిన చంద్రబాబునాయుడు వాటిని పెంచి ప్రజల్ని మరోసారి మోసం చేయడంపై మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం బుచ్చెయ్యపేట మండలం వడ్డాది విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట చేపట్టిన ఆందోళనకు నియోజకవర్గ ప్రజలు, వ్యాపారులు, రైతులు, యువకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఏఈ రాజుకు డిమాండ్ నోటీస్ అందించారు. తొలుత వడ్డాది చెరకు కాటా నుంచి నాలుగు రోడ్ల జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. మహానేత వైఎస్సార్ విగ్రహం వద్ద పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే రద్దు చేయాలని నినాదాలు చేశారు. మాయమాటలతో గద్దెనెక్కిన సీఎం చంద్రబాబునాయుడు సూపర్ సిక్స్ పథకాల్లో ఏ ఒక్కటీ అమలు చేయకపోగా, విద్యుత్ చార్జీలు పెంచి ప్రజల నడ్డి విరిచారన్నారు. ఇప్పటికే విద్యుత్ చార్జీలు పెంచి రూ.6,072 కోట్లకు పైగా ప్రజల్ని నుంచి వసూలు చేయగా, మరో రూ.9,412 కోట్లకు పైగా వసూలు చేయాలని కుయుక్తులు పన్నారన్నారు. ప్రతి గ్రామంలో బెల్ట్ షాపులు తెరిచి మద్యం విచ్చలవిడిగా అమ్మించడంతోపాటు అమ్మఒడి, రైతు భరోసాలాంటి పలు పథకాలు ఎత్తేసి ప్రజల ఆగ్రహాన్ని చూస్తున్నారన్నారు. ప్రజలే సీఎం చంద్రబాబుకు తగిన గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో చోడవరం ఏఎంసీ మాజీ చైర్మన్ ఏడువాక సత్యారావు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ముక్కా మహాలక్ష్మినాయుడు, బుచ్చెయ్యపేట, చోడవరం, రోలుగుంట, రావికమతం మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, పార్టీ మండల అధ్యక్షులు, వైస్ ఎంపీపీలు, ముఖ్య నాయకులు దొండా రాంబాబు, కె. అచ్చింనాయుడు, కోవెల జనార్దనరావు, పైలా రాజు, మారిశెట్టి శ్రీకాంత్, గాడి కాసు, వెంకటరావు, వై శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పోతల లక్ష్మీశ్రీనివాస్, దొండా లలితా నారాయణ మూర్తి, గొంపా చినబాబు, శంకర్రావు, టీవీ రమణ, ఓరుగంటి నెహ్రూ, ఎంపలి ఆనంద్, ఎల్లపు విజయ్‌కుమార్, గోవింద, పెదిరెడ్ల బాషా, సుంకరి శ్రీను, గాంధీ, గొల్లవిల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మోసగించిన చంద్రబాబు: మాజీ ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: అధికారంలోకి వచ్చిన ఆర్నెల్లలోనే చంద్రబాబు రెండు సార్లు విద్యుత్ చార్జీల భారం మోపి ప్రజలను మోసం చేశారని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ధ్వజమెత్తారు. ఒక్క పైసా కూడా విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పి.. ఇప్పుడు ఎడాపెడా పెంచడం దారుణమన్నారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు నియోజకవర్గ కేంద్రమైన నర్సీపట్నంలో కరెంటు చార్జీల బాదుడుపై పోరుబాట కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరి విద్యుత్ శాఖ ఈఈ కార్యాలయానికి చేరుకుని పెంచిన చార్జీలు తగ్గించాలని నినాదాలు చేశారు. అనంతరం కార్యాలయ ఏఈ నవీన్‌కు పార్టీ సీనియర్ నాయకులు చింతకాయల సన్యాసిపాత్రుడు, రుత్తల యర్రాపాత్రుడు, మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, పార్టీ నాయకులు వినతిపత్రం అందజేశారు. నిరసన ర్యాలీని ప్రారంభించిన సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గణేష్ మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు పెంచబోమని.. వినియోగదారులే విద్యుత్ ద్వారా సంపద సృష్టించేలా చేస్తానంటూ ప్రగల్భాలు పలికిన చంద్రబాబు ప్రజలను నిండా ముంచేశారని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం గద్దెనెక్కిన ఐదు నెలల్లోనే విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై రూ.15,485 కోట్లు భారం వేశారన్నారు. విద్యుత్ చార్జీలను పెంచబోమని..అవసరమైతే తగ్గిస్తామంటూ ఊదరగొట్టిన చంద్రబాబు అధికారంలోకి రాగానే బాదుడు మొదలు పెట్టారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు పోరుబాట కార్యక్రమం చేపట్టామన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 200 యూనిట్ల వరకు ఎస్సీ, ఎస్టీలకు విద్యుత్ బిల్లులో వెసులుబాటు కల్పిస్తే, ఇప్పుడు వారి నుంచి ముక్కుపిండి బిల్లులు వసూలు చేస్తున్నారన్నారు. అధికారంలోకి రాగానే వాటిని తుంగలో తొక్కి ప్రజలను మోసం చేశారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, పార్టీ నాయకులు డాక్టర్ లక్ష్మీకాంత్, ఎంపీపీలు సుర్ల రాజేశ్వరి, సాగిన లక్ష్మణ్‌మూర్తి, నాలుగు మండలాల నాయకులు పాల్గొన్నారు.

చార్జీలు పెంచి నడ్డి విరుస్తున్నారు



గతంలో మాకు నెలకు రూ.200 వరకు విద్యుత్ బిల్లు వచ్చేది. ఈ నెల రూ.300కు పైగా కరెంట్ బిల్లు వచ్చింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతు భరోసా లేకపోయినా మా లాంటి పేద రైతులకు మాత్రం విద్యుత్ బిల్లులు పెంచి భారం మోపుతున్నారు. ఇలా అయితే సామాన్య ప్రజలు ఎలా బతకాలి.

– బుద్ద కోటేశ్వరరావు, విజయరామరాజుపేట, బుచ్చెయ్యపేట మండలం

ఎస్సీలకు ఉచిత విద్యుత్ అందించాలి



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎస్సీలకు ఉచిత విద్యుత్ కింద 200 యూనిట్లు ఇచ్చేవారు. కూటమి అధికారంలోకి వచ్చాక దీన్ని ఎత్తేశారు. పలు గ్రామాల్లో ఎస్సీ ఇళ్లకు విద్యుత్ బిల్లులు కట్టాలని అందిస్తున్నారు. ఎస్సీలకు ఉచిత విద్యుత్ కొనసాగించాలి.

– గుడాల ఆనంద్, దళిత సంఘ నాయకుడు, శింగవరం, బుచ్చెయ్యపేట మండలం

యూనిట్‌కు ఐదు రెట్లు పెంచి వసూలు



గత వైఎస్సార్‌సీపీ హయాంలో సగటు యూనిట్ రూ.3.21 పైసలు ఉంటే, ప్రస్తుత ప్రభుత్వం యూనిట్‌కు ఐదు రెట్లు అధికంగా పెంచి వసూలు చేస్తోంది. 13 రకాల సుంకాలు విధించడంతో యూనిట్‌కు రూ.15 వరకు పెరిగింది. ఇటీవల పెంచిన బిల్లులు చెల్లించడంలో జాప్యం జరిగితే అపరాధ రుసుంతో వసూలు చెయ్యాలని ప్రభుత్వ ఆదేశించడం దారుణం.

– వేచలపు సహదేవుడు, కింతలి గ్రామం, మాడుగుల మండలం

మాట తప్పిన చంద్రబాబు



ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు పెంచబోమని హామీ ఇచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన ఆరు మాసాల్లోనే మాట తప్పారు. ఒక వైపు నిత్యావసర సరుకుల ధరలు భారీగా పెరగడంతో సామాన్యుడు సతమతమవుతుంటే, ఇప్పుడు విద్యుత్ చార్జీలు పెంచి గుది బండ మోపారు.

– వంటాకు నర్సింహమూర్తి, సర్పంచ్, వి.బి.పేట, చీడికాడ మండలం

మన్మోహన్ మృతికి సంతాపం



చీడికాడ: మన్మోహన్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

బుచ్చెయ్యపేట: మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి పట్ల మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శుక్రవారం వడ్డాదిలో మన్మోహన్ ఆత్మకు శాంతి కలగాలని కొద్దిసేపు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. దేశాభివృద్ధికి పలు సంస్కరణలు తీసుకొచ్చి వివాద రహితుడిగా పేరుగాంచిన మన్మోహన్ మృతి దేశానికి తీరని లోటన్నారు. నాయకులు, అధికారులు పాల్గొన్నారు. మన్మోహన్ మృతి పార్టీకి తీరని లోటని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు సయ్యపురెడ్డి సత్యనారాయణ, సీనియర్ నాయకుడు అడపా నర్సింహమూర్తి తెలిపారు.

చీడికాడ: ఎంపీడీవో హేమసుందరరావు ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి సిబ్బంది పూలమాలలతో శ్రద్ధాంజలి ఘటించారు. మన్మోహన్ సేవలను కొనియాడారు.

మాడుగుల రూరల్: స్థానిక బస్సు షెల్టర్‌లో మన్మోహన్ చిత్రపటానికి కాంగ్రెసు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పడాల కొండలరావు పూలమాల వేసి నివాళి అర్పించారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నాతవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మన్మోహన్ చిత్రపటానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సంతాపం తెలిపారు. కొద్దిసేపు మౌనం పాటించారు.

రక్తదానం మరొకరికి ప్రాణదానం



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

చోడవరం రూరల్: రక్తదానం చేయడం, మరొకరికి ప్రాణదానం చేసినట్లేనని విద్యార్థులు పట్టణ వీధుల్లో ఎలుగెత్తి నినదించారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం మూడు యూనిట్లు, ఇతర కళాశాలల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు రక్తదాన శిబిరం విజయవంతం చేయాలంటూ ప్రదర్శన చేపట్టారు. జనవరి 5వ తేదీన సీవీడీఎం ఆధ్వర్యంలో నిర్వహించే జీవధార మెగా బ్లడ్ బ్యాంకు శిబిరం విజయవంతం చేయాలని కోరుతూ చేపట్టిన ర్యాలీని చోడవరం ఎస్ఐ నాగరాజు ప్రారంభించారు. రక్తదానం చేయడం వల్ల బలహీనత రాదని, తిరిగి రక్తం యథావిధిగా చేరుతుందన్న అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ టీం కోఆర్డినేటర్ డి.మాల్యాద్రి, పీడీ మూర్తి, సబ్ రిజిస్ట్రార్ గీతాలక్ష్మి, సభ్యులు పుట్టా శ్రీనివాసరావు, దేవకుమారి, రజని, నరసింహమూర్తి, ఎన్ఎస్ఎస్ పీవోలు పాల్గొన్నారు.

సాంకేతికతపై పట్టు సాధించాలి

అవంతిలో సాంకేతిక సదస్సు ప్రారంభం



నమూనాల ప్రదర్శనను తిలకిస్తున్న ప్రముఖులు

మాకవరపాలెం: విద్యార్థులు సాంకేతికతపై పట్టు సాధించాలని రామ్‌కో సిమెంట్ కంపెనీ డిప్యూటీ జనరల్ మేనేజర్ సిఖిందర్‌బాషా సూచించారు. తామరం అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో సృజన -2024 సాంకేతిక సదస్సులను శుక్రవారం ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ విద్యార్థులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సాంకేతిక విజ్ఞానం మెరుగు పరుచుకోవాలన్నారు. మాజీ మంత్రి ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ సాంకేతిక విజ్ఞాన్ని పెంపొందించడంలో పాలిటెక్నిక్ విద్య పునాది వంటిదన్నారు. ప్రిన్సిపాల్ మోహన్‌రావు మాట్లాడుతూ ఉత్తమ నమూనాలకు ప్రథమ రూ.10 వేలు, ద్వితీయ రూ.5 వేలు బహుమతులు అందజేస్తామన్నారు. మొదటి రోజు వివిధ కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు 102 సాంకేతిక నమూనాలు, 50 పత్రిక నమూనాలను ప్రదర్శించారన్నారు. చోడవరం పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ నాగరాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆలిండియా ఆర్ట్స్ కాంపిటేషన్‌లో ప్రతిభ



మెడల్స్, సర్టిఫికెట్లతో ఆర్ట్స్ కాంపిటేషన్‌లో సాధించిన విద్యార్థులు

కె.కోటపాడు: ఆలిండియా ఆర్ట్స్ కాంపిటేషన్‌లో స్థానిక అయ్యన్న ఇంగ్లిష్ మీడియం స్కూలు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. అక్టోబర్‌లో నిర్వహించిన ఆలిండియా ఆర్ట్స్ కాంపిటేషన్ పోటీల్లో పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో 26 మంది ఉత్తమ చిత్రాలను గీసి బహుమతులకు ఎంపికయ్యారు. వీరికి ఆలిండియా ఆర్ట్స్ కాంపిటేషన్ నిర్వాహకులు మెడల్స్, సర్టిఫికెట్లతో అభినందించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను శుక్రవారం పాఠశాల ప్రాంగణంలో కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ పీవీజీ కుమార్, స్కూలు డైరెక్టర్లు డాక్టర్ ఎస్.కె.ఖాసిమ్, నూర్జహాన్ అభినందించారు.

మురుగు నిల్వలతో దోమల వృద్ధి



ఖాళీ గోలాల్లో నిల్వ నీటిని తొలగించాలని వివరిస్తున్న హెల్త్ అసిస్టెంట్ త్రినాథ్

కె.కోటపాడు: మురుగు నిల్వల వల్ల దోమలు వృద్ధి చెందుతాయని లంకవానిపాలెం పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ పి.త్రినాథ్ తెలిపారు. శుక్రవారం ఎ.కోడూరులో ఫ్రైడే–డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన వీధుల్లో పర్యటించిన వైద్య సిబ్బంది ఖాళీ గోలాల్లోను, ఖాళీ టైర్లు, రుబ్బురోళ్లలో మురుగు నీటిని తొలగించుకునే పద్ధతిని వివరించారు. ప్రతీ ఫ్రైడేను డ్రైడేగా ప్రజలు పాటించాలని కోరారు. ఎంఎల్‌హెచ్‌పీ శాంతి, ఏఎన్ఎంలు సంతోషి, కుమారి పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆధార్ శిబిరం

దేవరాపల్లి: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆధార్ శిబిరం రెండు రోజూ కొనసాగింది. ఆధార్ పేర్లు, అడ్రస్ మార్పు, ఆధార్‌కు ఫోన్ నంబర్ లింక్ తదితర సేవలను అందిస్తున్నారు. స్థానిక ప్రజల వినతి మేరకు మూడో రోజు శనివారం శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆధార్ కార్డులు లేని అంగన్‌వాడీ చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక గ్రామ మహిళ సంరక్షణ కార్యదర్శులు ఎస్‌కె. మీరాభి, ఎం. సంధ్యారాణి కోరారు.

మాజీ ఎమ్మెల్యే గణేష్‌పై విమర్శలు గర్హనీయం

వైఎస్సార్‌సీపీ మాకవరపాలెం మండల నేతలు



మాట్లాడుతున్న గోవిందరావు, ఇతర నేతలు

మాకవరపాలెం: మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన టీడీపీ నేతలు గత ప్రభుత్వంపైనా, మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్‌గణేష్‌పైనా విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందని వైఎస్సార్‌సీపీ నేతలు చిటికెల రమణ, బొడ్డు గోవిందరావు, రుత్తల రాజు అన్నారు. వారు మాట్లాడుతూ గిడుతూరు–సుంకపూరు రోడ్డు నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్‌కు మాజీ ఎమ్మెల్యే గణేష్ ధన్యవాదాలు తెలపడంపై శెట్టిపాలెం సర్పంచ్ అల్లు రామునాయుడు చేసిన విమర్శలను తీవ్రంగా ఖండించారు. అధికారం శాశ్వతం కాదని, అహంతో స్థాయి మరచి విమర్శలు చేయడంపై మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం వచ్చిన దగ్గర నుంచి పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అందిస్తున్నామని చెబుతున్న రామునాయుడు సూపర్ సిక్స్‌పై ప్రజల్లోకి వెళ్లి మాట్లాడాలని సూచించారు. టీడీపీలో నాయకుడిగా మరచిపోతారని, విలువ తగ్గిపోతుందన్న భ్రమతో విమర్శలు చేస్తున్నట్టుందన్నారు. మహిళలకు రూ.1,500, నిరుద్యోగ భృతి రూ.3 వేలు, అన్నదాత సుఖీభవ రూ.20 వేలు, తల్లికి వందనం, 50 ఏళ్లకే పింఛను అని ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. స్థాయి మరిచి మరొక్కసారి గణేష్‌పై విమర్శలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ పర్సన్ ఇన్‌చార్జ్ పాశపు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అసంపూర్తి భవన నిర్మాణాలపై జెడ్పీలో చర్చిస్తా

జెడ్పీటీసీ సభ్యురాలు కాపారపు అప్పలనర్స

నాతవరం: మండలంలో అసంపూర్తి నిర్మాణాలతో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల భవనాలు పూర్తి చేసేందుకు జెడ్పీ సమావేశంలో చర్చిస్తానని జెడ్పీటీసీ సభ్యురాలు కాపారపు అప్పలనర్స అన్నారు. మండల వ్యాప్తంగా అసంపూర్తిగా ఉన్న భవనాలు వివరాలను గొలుగొండ ఐసీడీఎస్ పీవో శ్రీగౌరీ శుక్రవారం ఆమెకు అందజేశారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ మండలంలో సరుగుడు, మాసంపల్లి, రాజుపేట అగ్రహారం, అచ్చంపేట, వెదురుపల్లి, ఎస్.బి.పట్నం, చినజగ్గంపేట, రామన్నపాలెం, నాతవరం, గోవిందపురం గ్రామాల్లో అంగన్‌వాడీ భవన నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్‌తో మాట్లాడి నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేస్తామన్నారు. నాతవరం సర్పంచ్ గొలగాని రాణి, వెదురుపల్లి సర్పంచ్ కాళ్ల సత్యనారాయణ, సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, నాగజ్యోతి పాల్గొన్నారు.

గ్రామ సమస్యలపై నిర్లక్ష్యం తగదు

ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి



మాట్లాడుతున్న ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి

నాతవరం: ప్రజాప్రతినిధులు అడిగిన గ్రామ సమస్యలపై పరిష్కరించేందుకు అధికారులు దృష్టి సారించాలని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి తెలిపారు. ఆయన అధ్యక్షతన శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. గత ప్రభుత్వ హయాంలో రూ.40 లక్షలతో నిర్మించిన పెదగొలుగొండపేట గ్రామ సచివాలయ భవనం, ఆర్బీకే, హెల్త్‌క్లినిక్ భవనాల బిల్లులు చెల్లించకుండా పంచాయతీ రాజ్ శాఖ జేఈ వెంకటేశ్వరమ్మ జాప్యం చేస్తున్నారని సర్పంచ్ మిరపల వెంకటరమణ, ఎంపీటీసీ సత్యనారాయణ నిలదీశారు. వెదురుపల్లిలో అంగన్‌వాడీ కేంద్రం భవనం బిల్లులు ఇవ్వకుండా ఆమె ఇబ్బందులు పెడుతున్నారని సర్పంచ్ కాళ్ల సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఆమె పద్ధతి మార్చుకుని పని చేస్తే బాగుంటుందని, లేదంటే కలెక్టరు ఫిర్యాదు చేస్తామని జెడ్పీటీసీ సభ్యురాలు కాపారపు అప్పలనర్స, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హెచ్చరించారు. గోకులం షెడ్లు కూటమి నేతల సిఫార్సు ఉన్న వారికి మంజూరు చేశారని గునుపూడి సర్పంచ్ వేముల సూర్యనారాయణమూర్తి, ఎంపీపీ లక్ష్మణమూర్తి ఆరోపించారు. చమ్మచింత పంచాయతీలో జగనన్న కాలనీకి కేటాయించిన లేఅవుట్లను ఆక్రమించుకుని వ్యవసాయం చేస్తున్నారని సర్పంచ్ వెలకాడ కొండబాబు, ఉప సర్పంచ్ అప్పన దివాణం తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె. ఉషశ్రీ, తహసీల్దార్ వేణుగోపాల్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.